కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, డిసెంబర్ 23 : ఎంపీడీఓ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. గ్యాస్ సబ్సిడీ వస్తుందా? అని మహిళలను అడుగగా.. రాలేదని చెప్పడంతో వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సన్న వడ్లకు బోనస్ వస్తుందా? అని అడుగగా.. పడడం లేదని అక్కడికి వచ్చిన రైతులు తెలిపారు. బోనస్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. బునాదిగాని కాల్వకు రూ.265 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ శేషగిరి రావు, ఎంపీడీఓ శంకరయ్య, సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

పత్తి మిల్లులో అధికారుల తనిఖీ

పత్తి మిల్లులో వివరాలు అడిగి తెలుసుకుంటున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని సిద్ధేశ్వర పత్తి మిల్లును విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. సీసీఐ కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన పత్తి వివరాలను అడిగి తెలుసుకొని రైతులతో మాట్లాడారు. నెల రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పత్తి వివరాలను సేకరించారు. వారి వెంట ఏఓ అపర్ణ, ఏఈఓ మనీషా, పత్తి కంపెనీ యజమానులు పాల్గొన్నారు.

రైతు లేనిదే రాజ్యం లేదు : ఎంఈఓ గురువారావు

రైతులను సన్మానిస్తున్న ఎంఈఓ గురువారావు

చౌటుప్పల్, డిసెంబర్ 23 : రైతు దేశానికి వెన్నెముక అని, రైతు లేనిదే రాజ్యం లేదని ఎంఈఓ గురువారావు అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ రైతుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సన్మానం చేశారు. అనంతరం మాట్లాడుతూ అందరి ఆకలి తీర్చడం కోసం నిస్వార్థంగా వ్యవసాయం చేస్తున్నవారే నిజమైన హీరోలన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే త్వరగా చేపట్టాలి

కాల్వపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

రాజాపేట, డిసెంబర్ 23 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని రాజాపేట, కాల్వపల్లి, రేణికుంట గ్రామాలను ఎంపీఓ కిషన్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు పూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 23 : మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలతోపాటు చెల్లించిన వేతనాలపై సామాజిక తనిఖీ గ్రామసభలు పూర్తయ్యాయని ఎంపీడీఓ రాములునాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం మండల పరిషత్ కార్యాలయ అవరణలో జరుగనుందని తెలిపారు. ప్రజా వేదిక సమావేశానికి రైతులు, ఉపాధి హామీ కూలీలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సూపరింటెండెంట్ లోకేశ్వర్ రెడ్డి, ఏపీఓ రమేశ్, ఎస్ఆర్‌పీ గంగరాజు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన

రైతులకు సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు

బీబీనగర్, డిసెంబర్ 23 : మండలంలోని జమీలాపేట్ గ్రామంలో అనురాగ్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగుపై వివరించారు. విత్తన శుద్ధి మొదలుకుని పంట చేతికొచ్చే వరకు సేంద్రియ పద్ధతిలో వాడాల్సిన మిశ్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మిడి సుభాశ్‌రెడ్డి, యర్కల పాండురంగంగౌడ్, శ్రీకాంత్ యాదవ్, రైతులు కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజాపేట, డిసెంబర్ 23 : నల్లగొండలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను మండలంలోని నెమిల జడ్పీ హైస్కూల్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. సభను విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు రాపోలు మధుసూదన్, కోశాధికారి అఖిల్ కోరారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్ : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్, డిసెంబర్ 23 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని కొండమడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొరపాట్లు లేకుండా సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తుదారుల వివరాలను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. సర్వే పారదర్శకంగా చేయాలని, సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజలు అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకుని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలన్నారు. రోజూ నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యూమరేటర్లు సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ ఎం.శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి అలివేలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దు

భువనగిరి కలెక్టరేట్ : ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దన్నారు. శాఖల వారీగా పూర్తి స్థాయిలో సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై పూర్తి స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో భాగంగా 55 అర్జీలను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 23 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమష్టిగా పని చేయాలని సూచించారు. జిల్లాలో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి యాక్సిడెంట్లను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. మానవ తప్పిదాలు, వాహనాల అత్యధిక వేగం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి రహదారి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి పక్కన చెత్త పడేయకుండా చూడాలని, అవి ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉంటాయని తెలిపారు. వేగ పరిమితిని కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమిత్ షాను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలి

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- కేంద్రమంత్రి షా దిష్టిబొమ్మల దహనం

వలిగొండ : కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చౌటుప్పల్ : కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, డిసెంబర్ 23 : పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అన్నారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచిన అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశాన్ని కుల, మత, ప్రాంతాలుగా విభజించి పరిపాలించాలని చూస్తున్న నరేంద్ర మోదీకి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, సీపీఎం నాయకులు కందాడి దేవేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీరాములు, ఎల్లారెడ్డి, జంగయ్య, సాయి, ఈశ్వరమ్మ, నర్సమ్మ, లక్ష్మి నర్సమ్మ, శోభ, దేవమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

వలిగొండ : బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, సీఐటీయూ జిల్లా నాయకుడు పైళ్ల గణపతిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు మొగిలిపాక గోపాల్, మెరుగు వెంకటేశం, వాకిటి వెంకట్‌రెడ్డి, భిక్షపతి, కిష్టయ్య, నాగరాజు, యాదగిరి, నర్సింహ, స్వామి పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ పాషా, బూర్గు కృష్ణారెడ్డి, శ్రీనివాసాచారి, గోశిక కరుణాకర్, కృష్ణయ్య, దాసు, యాదయ్య, మల్లేశ్, దశరథ, ఈదయ్య పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాచకొండ కృష్ణయ్య, కొమ్ము మల్లేశం, ఉడుత గాలయ్య, లక్ష్మారెడ్డి, సత్తయ్య, నీళ్ల అంజయ్య, భాస్కర్‌రెడ్డి, అంజయ్య, గాలయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు మాట్లాడుతూ దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి విద్వేషాలకు కారణమైన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల చంద్రయ్య, ప్రభాకర్, గంగయ్య, సోమరాజు, లక్ష్మణ్, యాదగిరి, రామస్వామి పాల్గొన్నారు.

బీబీనగర్ : షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

సంస్థాన్ నారాయణపురం : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదయ్య

మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, నాయకులు

బీబీనగర్, డిసెంబర్ 23 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆరవ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28నుంచి 30వరకు జరిగే ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో లోతైన చర్చ చేపడుతామన్నారు. రాబోయే కాలానికి ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.సుధర్మారెడ్డి, నాయకులు బి.దుర్గప్రసాద్, బి.నర్సిరెడ్డి, ఆర్.రాజు, రమేశ్, సీహెచ్ ప్రకాశ్, యశోధర, మమత, మనీష, శ్రవంతి పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మశాలీ మహాజన సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 23 : పద్మశాలీల సంక్షేమం, అభ్యున్నతి కోసం అందరూ కృషి చేయాలని పోచంపల్లి పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జరిగిన సంఘం 30వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నోముల రఘు, ఉపాధ్యక్షులుగా గుర్రం లక్ష్మీనారాయణ, గుండు రాజు, ప్రధాన కార్యదర్శిగా కొంగరి వెంకటేశం, సహాయ కార్యదర్శిగా చిలువేరు శంకర్‌దాస్, కోశాధికారిగా వనం వెంకటేశం ఎన్నికయ్యారు. సమావేశంలో పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేశ, టైఅండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ గుండు మధు, దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు జంగయ్య, పాండు, యాదగిరి, చంద్రయ్య, నరసింహ పాల్గొన్నారు.

లక్ష డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు శంకర్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 23 : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరుతూ వచ్చే నెల హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద శంకర్, జిల్లా నాయకుడు బూడిద జానీ పిలుపునిచ్చారు. మండలంలోని చొల్లేరు గ్రామంలో సోమవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వద్దిగళ్ల ప్రశాంత్, అధికార ప్రతినిధిగా వద్దిగళ్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా వద్దిగళ్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా చింతకింది సాయికిరణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గోపి నాగరాజు, సీనియర్ నాయకులు వద్దిగళ్ల పాపయ్య, మురళి, మీసాల జగదీశ్, మహేశ్, చందు, రాజశేఖర్ పాల్గొన్నారు.

'దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి'

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 23 : పోలీస్‌స్టేషన్ ఆవరణలో దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని బాధితుడు మారుపాక శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని రాయిపల్లిలో కాళీ స్థలం గేటు విషయంలో ఆరె నర్సయ్యతో గొడవ జరుగగా.. ఒకరినొకరు నెట్టేసుకున్నామన్నారు. ఈ విషయంపై రెండ్రోజుల క్రితం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నర్సయ్య కుమారులు పోలీస్‌స్టేషన్‌లోనే తనపై దాడి చేశారని ఆరోపించారు. కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వకుండా పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఐ కృష్ణయ్యను వివరణ కోరగా.. ఫిర్యాదుదారుడు అందజేసిన దరఖాస్తును కోర్టుకు అందజేశామన్నారు. కోర్టు నుంచి ఆదేశాలు రాగానే విచారణ చేపట్టి దాడి చేసిన వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 23 : యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో మంగవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుట్ట డిపో పరిధిలో గల గ్రామాల ప్రజలు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 9959226310 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలతోపాటు సమస్యలను తెలుపాలని సూచించారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

ఆలేరు టౌన్, డిసెంబర్ 23 : పట్టణంలోని బుడిగ జంగాల కాలనీకి చెందిన మోతె మార్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆలేరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళ, లయన్ డాక్టర్ చింతకింది మురహరి దంపతులు సోమవారం 50కిలోల బియ్యం అందజేశారు. వారికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుండాల, డిసెంబర్ 23 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వస్తాకొండూర్ గ్రామానికి చెందిన జక్కుల వెంకటయ్య అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేయాలి'

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్

మోత్కూరు, డిసెంబర్ 23 : మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రానికి మోత్కూరుకు 42 కిలోమీటర్లు, అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి 70 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. సమస్యలను విన్నవించుకునేందుకు అక్కడి నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం ఐదు మండలాలకు ఒక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన మోత్కూరును అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలతో కలిపి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కలిమెల నర్సయ్య, జయప్రకాశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్రన్, జైపాల్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 23 : యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.రవిచంద్రన్, వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేసే వరకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పేరబోయిన స్వామి అధ్యక్షతన జరిగిన సంఘం జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులపై అధికారుల ఒత్తిడి ఆపాలన్నారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఇండ్లల్లో పని చేయించే విధానాన్ని విరమించుకోవాలని సూచించారు. ఉదయం 6నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఒకటే షిఫ్ట్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, మన్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పెంటయ్య, సీపీఐ మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్ పాల్గొన్నారు.

అండర్‌పాస్ సీకులను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- పలువురికి స్వల్ప గాయాలు


వంగపల్లిలో ఇనుప చువ్వలను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 23 : అండర్ పాస్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలోని వంగపల్లి బైపాస్ రోడ్డుకు మోటకొండూర్ మండలానికి వెళ్లేందుకు నిర్మిస్తున్న అండర్ పాస్ వద్ద సోమవారం జరిగింది. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న వరంగల్-2 డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు అండర్ పాస్ వద్దకు రాగానే అతివేగంతో పక్కనే అండర్ పాస్ నిర్మాణంలో ఉన్న ఇనుప చువ్వలను ఢీకొట్టి నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30మందికి పైగా ప్రయ